బలగం TV
BALAGAM
నిజమే మా బలం.. ప్రజలే మా బలగం
BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com
హైదరాబాద్ బుధవారం 09 అక్టోబర్ 2024 | www.balagamtv.com | పేజీలు 4


## హైడ్రాతో సర్వే ఆఫ్ ఇండియా

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

హైదరాబాద్‌లో చెరువుల పునరుద్ధరణ కోసం హైడ్రాతో కలిసి పనిచేసేందుకు సర్వే ఆఫ్ ఇండియా ముందుకు వచ్చింది. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లను నిర్ధారించడంలో ఇకపై సర్వే ఆఫ్ ఇండియా భాగస్వామ్యం కానున్నట్లు హైడ్రా కమిషనర్ రంగనాథ్ తెలిపారు. తన బృందంతో కలిసి హబ్సిగూడలోని సర్వే ఆఫ్ ఇండియా కార్యాలయానికి రంగనాథ్ వెళ్లారు. సర్వే ఆఫ్ ఇండియా డైరెక్టర్ బీసీ పరీడా, సూపరింటెండెంట్ ఆఫ్ సర్వే డేబబ్రత పాలిట్‌తో పాటు ఇతర ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు.

సర్వే ఆఫ్ ఇండియా రూపొందించిన పాత మ్యాప్‌లను పరిశీలించిన రంగనాథ్ 1971 – 72 సర్వే ప్రకారం నగరంలో ఎన్ని చెరువులున్నాయి? ఎంత విస్తీర్ణంలో ఉన్నాయి? ప్రస్తుతం వాటి పరిస్థితి ఏంటి? నాలాలు ఎంత విస్తీర్ణంలో ఉండేవి, ఇప్పుడు ఎంత మేర కబ్జా అయ్యాయనే తదితర వివరాలను మ్యాప్‌లతో సహా పరిశీలించారు.దశాబ్దాల క్రితం నాటి మ్యాప్‌లతో పాటు నేటి పరిస్థితిని సరిపోల్చుతూ చెరువులు, నాలాల వివరాలను సర్వే ఆఫ్ ఇండియా అధికారులు రంగనాథ్?కు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ఇప్పటికే హెచ్‌ఎండీఏ, నీటిపారుదల శాఖ, జీహెచ్‌ఎంసీ నుంచి సేకరించిన చెరువుల జాబితాతో సర్వే ఆఫ్ ఇండియా వద్ద ఉన్న సమాచారాన్ని

మిగితా 3వ పేజీలో

# జమ్మూ కశ్మీర్ కాంగ్రెస్ కూటమిదే..



- **కాంగ్రెస్ ఎన్‌సీపీకే పట్టం**

**బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో**

ఆర్టికల్ 370 రద్దు తర్వాత జమ్ముకశ్మీర్‌లో తొలిసారి జరిగిన ఎన్నికల్లో నేషనల్ కాన్ఫరెన్స్–కాంగ్రెస్ కూటమి విజయం సాధించింది. జమ్ముకశ్మీర్ అసెంబ్లీలో 90 స్థానాలు ఉండగా ఎన్‌సీ 42 చోట్ల, కాంగ్రెస్ 6 స్థానాల్లో విజయ దుందుభి మోగించాయి. బీజేపీ 29 సీట్లను సొంతం చేసుకుంది. పీడీపీ మూడు స్థానాలకు పరిమితమైంది. 10 స్థానాల్లో ఇతరులు గెలుపొందారు. అందులో ఒకరు ఆప్ అభ్యర్థి ఉన్నారు.

జమ్ముకశ్మీర్ ప్రజలు ఎన్‌సీ–కాంగ్రెస్? కూటమివైపే మొగ్గు చూపారు. పూర్తి స్థాయి రాష్ట్ర హోదా సాధనకు కృషి చేస్తామన్న వాగ్దానాన్ని నమ్మి– ఆ రెండు పార్టీలకే పట్టం కట్టినట్టు తెలుస్తోంది. పీడీపీ కూడా ఇలాంటి హామీలే ఇచ్చినా గతంలో బీజేపీతో జట్టు కట్టడం వంటి పరిణామాల నేపథ్యంలో ఆ పార్టీని ప్రజలు నమ్మలేదు.

ఇక చరిత్రలో తొలిసారి జమ్ముకశ్మీర్ శాసనసభ ఎన్నికల్లో గెలుపొందింది ఆప్. దోడా నియోజకవర్గం నుంచి ఆప్ టికెట్‌పై పోటీ చేసిన మెహ్రాజ్ మాలిక్– బీజేపీ అభ్యర్థిపై గజయ్ సింగ్ రాణాపై 4,538 ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించారు.

జమ్మూ కాశ్మీర్ నేషనల్ కాన్ఫరెన్స్, కాంగ్రెస్, సీపీఐ(ఎం), జమ్మూ కాశ్మీర్ నేషనల్ పాంథర్స్ పార్టీలు కలిపి 49 నియోజకవర్గాల్లో విజయం సాధించాయి. అలయన్స్ లో జమ్మూ కాశ్మీర్ నేషనల్ కాన్ఫరెన్స్ ఎక్కువ సీట్లు కైవసం చేసుకుంది. 42 మంది జమ్మూ కాశ్మీర్ నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ అభ్యర్థులే గెలిచారు. కాంగ్రెస్ పార్టీ నుంచి బరిలోకి దిగిన వారిలో ఆరుగురు విజయం సాధించారు. సీపీఐ(ఎం) కాండిడేట్ ఒకరు గెలిచారు.

29 నియోజకవర్గాల్లో బీజేపీ అభ్యర్థులు గెలిచారు. పీపుల్స్ డెమోక్రటిక్ పార్టీ 3 స్థానాలు కైవసం చేసుకుంది. స్వతంత్ర పార్టీ అభ్యర్థులు ఆరుగురు గెలవగా.. మరో ఇద్దరు చెరో పార్టీ నుంచి విజయం సొంతం చేసుకున్నారు. నేషనల్ కాన్ఫరెన్స్ కూటమికి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేంత మెజార్టీ సీట్లు వచ్చాయి. దీంతో కూటమి ముఖ్యమంత్రి అభ్యర్థికి ఒమర్ అబ్దుల్లా బనేని ప్రకటించారు.

# హరియాణాలో కమలం హ్యాట్రిక్

- **వరుసగా మూడోసారి అధికారం**
- **ఎగ్జిట్ పోల్స్ అంచనాలు తలకిందులు..**

**బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో**

హరియాణాలో మరోసారి కమలం వికసించింది. ఎగ్జిట్ పోల్స్ అంచనాలను తలకిందులు చేస్తూ బీజేపీ ముచ్చటగా మూడోసారి అధికారాన్ని చేజిక్కుంచుకుంది. మొత్తం 90 అసెంబ్లీ నియోజకవర్గాలు గానూ 48 స్థానాలు గెలుచుకొని బీజేపీ హ్యాట్రిక్ కొట్టింది. ప్రతిపక్ష పార్టీ కాంగ్రెస్ 37 సీట్లు కైవసం చేసుకుంది. ఐఎన్ఎల్‌డీ రెండు స్థానాల్లో, ఇతరులు మూడు స్థానాల్లో గెలుపొందారు. ఆమ్ ఆద్మీ పార్టీ ఖాతానే తెరవలేదు. కౌంటింగ్ ఆరంభంలో ముందంజలో ఉన్న కాంగ్రెస్, కొద్దిసేపటికే రెండో స్థానానికే పరిమితమైంది.

పదేళ్ల తర్వాత కాంగ్రెస్ పార్టీ అధికారం చేపడుతుందని ఎగ్జిట్ పోల్స్ అంచనా వేశాయి. కానీ ఫలితాలు మొత్తం తారుమారు అయ్యాయి. పదేళ్ల పాలనలో బీజేపీపై నెలకొన్న ప్రభుత్వ వ్యతిరేకత, రైతు చట్టాల నిరసనలు, రెజర్ల ఆందోళనలు, జాట్‌ల అసంతృప్తి వంటి అంశాలు రాజకీయ అస్త్రాలుగా మారినా– అవి కాంగ్రెస్‌ను గెలుపు దిశగా నడిపించలేకపోయాయి. జాట్‌లు, ఎస్‌సీ ఓటర్లు 40శాతం ఉన్నా, కాంగ్రెస్‌కు కలిసిరాలేదు.



హరియాణా సీఎం నాయబ్ సింగ్ సైనీ లాడ్వా నియోజకవర్గంలో 16,054 ఓట్ల అధిక్యంతో కాంగ్రెస్ అభ్యర్థి మేవా సింగ్‌పై ఘన విజయం సాధించారు. మాజీ రెజ్లర్, కాంగ్రెస్ అభ్యర్థి వినేశ్ ఫొగట్ జులానాలో గెలుపొందారు. ఆమె తన ప్రత్యర్థి బీజేపీకి చెందిన యోగేశ్ కుమా ర్‌పై 6,015ఓట్ల తేడాతో విజయం సాధించారు. కాంగ్రెస్ అభ్యర్థి ఆ పార్టీ సీనియర్ నేత రణదీప్ సూర్జేవాలా తనయుడు ఆదిత్య సూర్జేవాలా కైథాల్‌లో గెలిచారు. హిస్సార్ నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసిన పారిశ్రామికవేత్త, బీజేపీ ఎంపీ నవీన్ జిందాల్ తల్లి సావిత్రి జిందాల్ విజయం సాధించారు.అంబాలా కంటోన్మెంట్ నుంచి బీజేపీ సీనియర్ నేత, మంత్రి అనిల్ విజ్ విజయం సాధించారు.మాజీ సీఎం, కాంగ్రెస్ సీనియర్ నేత భూపిందర్ సింగ్ హుడా గర్హి–సంప్లా–కిలోయ్ స్థానంలో గెలుపొందారు.ఉచానా కలాన్ స్థానంలో హోరాహోరీగా సాగిన పోరులో కేవలం 39 ఓట్ల మోజారిటీతో బీజేపీ అభ్యర్థి దేవేందర్ చతర్ భుజ్ యాత్రి విజయం సాధించారు. ఈ స్థానంలో పోటీ చేసిన జేజేపీ అధినేత దుష్యంత్ చౌతాలా ఏకంగా నాలుగో స్థానానికి పరిమితయ్యారు.ఈ విజయంతో ఆ పార్టీశ్రేణులు సంబరాలు చేసుకున్నారు. కార్యకర్తలు మిఠాయిలు పంచారు. బాణసంచా కాలుస్తూ నృత్యాలు చేశారు. హరియాణా ప్రజలు మరోసారి ప్రధాని మోదీ నాయకత్వాన్ని బలపరిచారని సంతోషం వ్యక్తం చేశారు.

## హైదరాబాద్‌లో తైవాన్ ఇండస్ట్రియల్ పార్క్..

**బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో**

అంతర్జాతీయ పెట్టుబడులు, బహుళజాతి సంస్థల ప్రాంతీయ కార్యాలయాలు నెలకొల్పడంతో ప్రపంచ పటంలో ప్రత్యేక స్థానాన్ని పొందిన హైదరాబాద్ మహానగరంలో తైవాన్ ఇండస్ట్రియల్ పార్క్ నెలకొల్పుతామని ఆ దేశ ప్రతినిధి బృందం ప్రత్యేక ఆసక్తితో ముందకు వచ్చింది.తైవాన్ నుంచి పెట్టుబడులను ఆకర్షించడం లక్ష్యంగా తెలంగాణా ఐటీ, పరిశ్రమల శాఖ, తైవాన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ సంస్థలు (టీసీసీ) ద్వైపాక్షిక సహకార ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశాయి. ఈ వ్యూహాత్మక భాగస్వామ్యంవల్ల రాష్ట్ర వ్యాప్తంగా పెట్టుబడులు, మౌలిక సదుపాయాల అభివృద్ధి, కొత్త ఉద్యోగాల కల్పన జరుగుతుంది.

మంగళవారం రాష్ట్ర పరిశ్రమల మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ (టీజీఐఐజీ) కార్యాలయంలో ప్రభుత్వ స్పెషల్ సెక్రటరీ విష్ణువర్ధన్ రెడ్డి, టీసీసీ ఉపాధ్యక్షుడు సైమన్ లీ మధ్య ఈ ఎంఓయూ జరిగింది. తైవాన్ నుంచి పెట్టుబడులను రాబట్టేందుకు టీసీసీ హైదరాబాద్‌లో ప్రత్యేకంగా ఒక కార్యాలయాన్ని త్వరలోనే ఏర్పాటు చేయనుంది.తైవాన్ కంపెనీలు రాష్ట్రంలోకి ప్రవేశించడంలో టీసీసీ కీలక మాధ్యమంగా నిలుస్తుంది. హైదరాబాద్‌లో తైవాన్ ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు కోసం ఇప్పటికే రూపకల్పన జరిగింది. మార్కెట్ ఎంట్రీ అధ్యయనాలు, పెట్టుబడిదారులతో సమావేశాలు నిర్వహించడం, తెలంగాణాను అంతర్జాతీయంగా ప్రమోట్ చేయడం లాంటి కార్యక్రమాలు నిర్వహించనుంది.

ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. రాష్ట్రంలో పెట్టుబడులతోపాటు అధ్యయన కేంద్రాలు నెలకొల్పడానికి అనేక దేశాల నుంచి సుముఖత వ్యక్తమవుతోందని తెలిపారు. ప్రపంచశ్రేణి మౌలిక సదుపాయాలు.. భౌగోళిక వనరులు, అంతర్జాతీయ రవాణా సైకర్యం..అన్నింటికీ మించి అత్యంత చౌకగా దొరికే ఉన్నతశ్రేణి మానవ వనరులు తెలంగాణ ప్రత్యేకత అని, అందుకే పేరుగాంచిన బహుళజాతి సంస్థలు సైతం హైదరాబాద్ వైపు దూస్తున్నాయని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఇండియా తైపీ అసోసియేషన్ డైరెక్టర్ జనరల్ మన్ప్రీ సింగ్ యాదవ్ కూడా పాల్గొన్నారు.

## ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పిన హర్యాణా ప్రజలు

- **బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**



బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో

2029 ఎన్నికల్లో జాతీయ పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్ మేజిక్ ఫిగర్‌కు దూరంగా ఆగిపోతాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. తదుపరి కేంద్ర ప్రభుత్వ ఏర్పాటులో ప్రాంతీయ పార్టీలే కీలకమవుతాయన్నారు. దశాబ్దం, అంతకంటే ఎక్కువ కాలమే ఈ పరిస్థితి కొనసాగవచ్చునని అభిప్రాయపడ్డారు.

హర్యానా, జమ్ము కశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై ఆయన ట్వీట్ చేశారు. నేటి ఎన్నికల ఫలితాలతో కొన్ని అంశాలు స్పష్టంగా తెలిశాయని ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. మహారాష్ట్ర, జార?ండ్, ఢిల్లీ ఎన్నికల ఫలితాల తర్వాత మరింత స్పష్టత వస్తుందన్నారు.ఐదు హామీల పేరుతో కర్ణాటకలో, ఆరు గ్యారెంటీల పేరుతో తెలంగాణలో, 10 హామీలతో హిమాచల్ ప్రదేశ్‌లో ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి హర్యానా ప్రజలు మాత్రం బుద్ధి చెప్పారని అన్నారు. వారి అబద్ధపు హామీలను నమ్మలేదని పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో హామీలను అమలు చేయకుంటే నష్టం తప్పదని కాంగ్రెస్ పార్టీకి అర్థమై ఉంటుందన్నారు.

రెండు జాతీయ పార్టీల పట్ల ప్రజల్లో విముఖత ఉందనే విషయం స్పష్టంగా అర్థమవుతోందని అన్నారు మాజీ మంత్రి హరీశ్ రావు. కాంగ్రెస్ పార్టీ గ్యారెంటీల గారడీని హర్యానా ప్రజలు నమ్మలేదని చెప్పారు. కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లో కాంగ్రెస్ చేసిన మోసాన్ని హర్యానా ప్రజలు గమనించారని అన్నారు. ఆ ప్రభావం ఈ ఎన్నికల్లో కనిపించిందని చెప్పారు. ఈ ఫలితాలను చూసిన తర్వాతైనా సీఎం రేవంత్ రెడ్డి దృష్టి మళ్లింపు రాజకీయాలు, ప్రతీకార రాజకీయాలను మానుకోవాలని సూచించారు. ఆరు గ్యారెంటీలను, 420 హామీలను చిత్తశుద్ధితో అమలు చేయాలని హితవు పలికారు. జమ్మూకశ్మీర్ లో బీజేపీని అక్కడి ప్రజలు విశ్వసించలేదని చెప్పారు.

## రేపు ట్యాంక్ బండ్‌పై ఘనంగా బతుకమ్మ వేడుకలు



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

హైదరాబాద్ లోని ట్యాంక్ బండ్ పై దాదాపు పదివేల మంది మహిళలచే ఈనెల 10 వతేదీన సద్దుల బతుకమ్మ ఉత్సవాన్ని అత్యంత ఘనంగా నిర్వహిస్తున్నట్టు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి తెలియచేశారు. 10వ తేదీన నిర్వహించే సద్దుల బతుకమ్మ వేడుకల ఏర్పాట్ల పై నేడు సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. వివిధ శాఖల కార్యదర్శులు, పోలీస్ అధికారులు హాజరైన ఈ సమావేశంలో సి.ఎస్. మాట్లాడుతూ, 10వ తేదీ సాయంత్రం 4 గంటలకు సచివాలయం ఎదురుగాగల అమరవీరుల స్మారక కేంద్రం నుండి వేలాది మంది మహిళలు బతుకమ్మలతో ఊరేగింపుగా ట్యాంక్ బండ్ పైకి చేరుకుంటారని, వీరితోపాటు వందలాది మంది కళాకారులు తమ కళారూపాలతో ర్యాలీగా వస్తారని వివరించారు. ట్యాంక్ బండ్ పై ఏర్పాటు చేసే వేదిక వద్ద జరిగే ఈ బతుకమ్మ ఉత్సవాలకు ప్రజాప్రతినిధులు హాజరవుతారని అన్నారు. ఈ సందర్భంగా, బుద్ధ విగ్రహం, సంజీవయ్య పార్క్‌లనుండి ప్రత్యేకంగా ఫైర్ వర్క్స్, లేజర్ షో ల ప్రదర్శన ఉంటుందని పేర్కొన్నారు.

ఈ బతుకమ్మ ఉత్సవాలను పురస్కరించుకొని పండగ శోభ వచ్చేలా నగరంలోని 150 ప్రధాన కూడళ్లలో బతుకమ్మలను ఏర్పాటు చేయడమే కాకుండా పలు జంక్షన్ల కేంద్రాల వద్ద విద్యుత్ దీపాలతో అలంకరించినట్టు తెలిపారు. నగరంలోని అన్ని ప్రధాన కార్యాలయాలను కూడా విద్యుత్ దీపాలతో అలంకరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ట్యాంక్ బండ్ పై బతుకమ్మ ఆడేందుకు సమీపంలోని వాడలు, కాలనీలు, బస్తీల నుండి పెద్ద ఎత్తున మహిళలు వచ్చే అవకాశమున్నందున వారికి ఏవిధమైన ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అదేవిధంగా, ట్యాంక్ బండ్ చిల్డ్రన్స్ పార్క్ లోఉన్న బతుకమ్మ ఘాట్ తోపాటు నెక్లెస్ రోడ్డులో బతుకమ్మ ల నిమజ్జనానికి ప్రత్యేక ఏర్పాటు చేయాలని హెచ్ఎండీఏ, జీహెచ్ ఎంసీ అధికారులను కోరారు. సాయంత్రం 5 .30 నుండి 7 .30 గంటల మధ్య ట్యాంకు బండ్ పై బతుకమ్మ ఉత్సవాలు జరుగుతున్నందున ట్రాఫిక్ డైవర్షన్, బారికేడింగ్, కనీస సౌకర్యాల ఏర్పాట్లను చేపట్టాలని తెలిపారు.

అమరవీరుల స్మారక కేంద్రం నుండి ట్యాంక్ బండ్ వరకు ప్రత్యేకంగా బారికేడింగ్, లైటింగ్ సౌకర్యాలను కల్పించాలని కోరారు. ప్రతీ శాఖ ఒక సీనియర్ అధికారిని ప్రత్యేకంగా నియమించి ఏర్పాట్లను పర్యవేక్షించాలని సి.ఎస్ ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో ప్రభుత్వ ముఖ్య కార్యదర్శులు వాణి ప్రసాద్, దాన కిషోర్, ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా జోంగ్తు,హైదరాబాద్ నగర పోలీస్ కమీషనర్ సి.వీ ఆనంద్, రోడ్లు భవనాల శాఖ ప్రత్యేక కార్యదర్శి హరిచందన, ఇంధన శాఖ కార్యదర్శి రోనాల్డ్ రోస్, జీహెచ్ఎంసీ కమీషనర్ ఆమ్రపాలి కాటా, జలమండలి ఎండీ అశోక్ రెడ్డి, సమాచార శాఖ స్పెషల్ కమీషనర్ హనుమంత రావు వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## హర్యానాలో ఈవీఎంలు ట్యాంపరయ్యాయి

**కాంగ్రెస్ నేతలు పవన్ ఖేరా, జైరాం రమేశ్**

**బలగంటీవి, న్యూఢిల్లీ బ్యూరో**

హర్యానాలో అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా అనూహ్య పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రారంభం కాగా.. 9 గంటలకల్లా కాంగ్రెస్ పార్టీ మెజారిటీ సీట్లలో ఆధిక్యంలో నిలిచింది. దాంతో కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాలయంలో సంబరాలు మొదలయ్యాయి. అయితే గంటలోపే పరిస్థితి పూర్తిగా మారిపోయింది. 10 గంటల కల్లా బీజేపీ అనూహ్యంగా ఆధిక్యంలోకి వచ్చేయడం, ఆ తర్వాత తుది ఫలితాల్లోనూ బీజేపీ ఘన విజయం సాధించడం జరిగిపోయాయి.

దీనిపై కాంగ్రెస్ పార్టీ తీవ్ర అనుమానం వ్యక్తం చేస్తోంది. కాంగ్రెస్ నేతలు పవన్ ఖేరా, జైరాం రమేశ్ ప్రెస్ మీట్ ఏర్పాటుచేసి ఎన్నికల ఫలితాలపై మాట్లాడారు. హర్యానాలో అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను తాము అంగీకరించడం లేదని వారు తేల్చిచెప్పారు. ఈవీఎంలలో అవకతవకలు జరిగాయని, ప్రజల అభీష్టాన్ని బీజేపీ తారుమారు చేసిందని ఆరోపించారు. మధ్యాహ్నం వరకు తాను ఈసీతో టచ్‌లో ఉంటూ మూడు జిల్లాల్లోని ఈవీఎంలపై ఫిర్యాదు చేసినట్లు జైరామ్ రమేశ్ తెలిపారు.హర్యానాలో ఫలితాలు పూర్తిగా అనూహ్యంగా, ఆశ్చర్యకరంగా ఉన్నాయని రమేష్ వ్యాఖ్యానించారు. క్షేత్రస్థాయి పరిస్థితికి ఇవి పూర్తి విరుద్ధంగా ఉన్నాయన్నారు. ఇది ప్రజాభీష్టాన్ని తారుమారు చేయడమేనని, ప్రజాస్వామ్య ప్రక్రియను నాశనం చేయడమేనని విమర్శించారు. ఉదయమే ఈసీ వెబ్ సైట్లో ఫలితాల సరళి అప్ డేట్ సరిగా జరగడం లేదంటూ జైరామ్ రమేశ్ ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ఈసీ.. కాంగ్రెస్ ఆరోపణలు బాధ్యతారాహిత్యం అని పేర్కొంది. మరో కాంగ్రెస్ నేత పవన్ ఖేరా కూడా హర్యానా ఫలితాలు అనూహ్యంగా ఉన్నాయని అన్నారు.


# కుల గణన విధివిధానాల పై కసరత్తు

- **సెక్రటేరియట్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్ సమావేశం**
- **నెల రోజుల్లోపు కుల గణన పూర్తి చేసే యోచన**
- **2-3 రోజుల్లో ప్రభుత్వం కీలక భేటీ**

**బలగంటీవి, న్యూఢిల్లీ బ్యూరో**

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కుల గణన చేయడానికి వేగంగా అడుగులు ముందుకు పడుతున్నాయి.కుల గణన పై షెడ్యూల్ ఖరారు చేయడానికి రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ నేతృత్వంలో సెక్రటేరియట్ లోని వారి ఛాంబర్ లో కీలక సమావేశం జరిగింది. సమావేశంలో బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ తో పాటు ముఖ్యమంత్రి ప్రధాన సలహాదారు వేం నరేందర్ రెడ్డి,బీసీ కమిషన్ సభ్యులు , సభ్యులు వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వం బీసీల్లో రిజర్వేషన్స్ ఖరారు చేయడానికి బీసీ కమిషన్ ను ఏర్పాటు చేసింది. ఇప్పటికే కుల గణన కోసం అసెంబ్లీలో ,క్యాబినెట్ లో కూడా తీర్మానం చేసింది. అయితే కుల గణన ఎలా చేయాలి అనే దానిపై అధికారులతో చర్చించారు. ఇప్పటికే వివిధ రాష్ట్రాల్లో చేసిన కుల గణన పై అధ్యయనం చేశారు. కర్ణాటక , బీహార్, ఆంధ్రప్రదేశ్ లో చేసిన కుల గణన పై సమావేశంలో చర్చించారు. కర్ణాటక లో బీసీ కమిషన్ చేసిన సర్వే, బీహార్ లో జీఏడి ద్వారా చేసిన సర్వే , ఆంధ్రప్రదేశ్ లో పంచాయతీ రాజ్ ద్వారా సర్వే చేసిన అంశాల పై చర్చించారు. అక్కడ డోర్ టూ డోర్ పూర్తి స్థాయి సర్వే నిర్వహించారు. ఇందులో మూడు రాష్ట్రాల్లో చేసిన బెస్ట్ పాలసీ నీ తీసుకొని ఇక్కడ అమలు చేయాలని సమావేశంలో నిర్ణయించారు.



మరోవైపు ఎస్సి వర్గీకరణ కు సుప్రింకోర్టు సానుకూలంగా తీర్పు ఇవ్వడం ప్రభుత్వం వర్గీకరణ మీద సబ్ కమిటీ సమావేశాలు కొనసాగుతుండటంతో కుల గణన సర్వే నివేదిక ఎస్సి వర్గీకరణ కు కూడా అవసరం ఉంటుంది కాబట్టి పూర్తి స్థాయి కులాల గణన చేసి వారికి అవసరమైన డేటా తీసుకునేలా చేసే అంశం పై చర్చించారు. రిపోర్ట్ పారదర్శకంగా ఉండడానికి ఇరు శాఖలకు సంబంధం లేకుండా కుల గణన జీఏడీ లేదా పంచాయతీ రాజ్ , రెవెన్యూ లో దేని ద్వారా చెపించాలనే దానిపై రెండు రోజుల్లో సీనియర్ మంత్రులతో ప్రభుత్వం కీలక సమావేశం ఏర్పాటు చేయనుందని సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. కుల గణన కు సీనియర్ ఐఏఎస్ అధికారి నేతృత్వంలో మానిటరింగ్ చేసేలా చూడాలని సూచించారు. కుల గణన ప్రారంభమై నెల రోజుల్లో పూర్తి చేయాలని సమావేశం లో నిర్ణయం తీసుకున్నారు. సమావేశంలో బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ ,కమిషన్ సభ్యులు , బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి బుర్ర వెంకటేశం,పంచాయతీ రాజ్ సెక్రటరీ లోకేష్ కుమార్ , కమిషనర్ అనితా రామచంద్రన్ ,బీసీ కమిషనర్ బాల మాయాదేవి , లా సెక్రటరీ రాజశేఖర్ ఇతర ముఖ్య అధికారులు..



## కోర్టులో నాగార్జున స్టేట్‌మెంట్..

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

టాలీవుడ్ నటి సమంతపై మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు సినీ, రాజకీయ వర్గాల్లో తీవ్ర దుమారం రేపుతున్న విషయం తెలిసిందే. కొండా సురేఖ కామెంట్స్‌పై క్రిమినల్ కేసుతోపాటు, పరువు నష్టం దావా విచారణలో భాగంగా నాంపల్లి కోర్టుకు నాగార్జున, అమల, నాగచైతన్యతోపాటు సుప్రి, వెంకటేశ్వర్లు హాజరయ్యారు.

కోర్టు నాగార్జున స్టేట్‌మెంట్ రికార్డు చేసినట్టు సమాచారం. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ.. మా కుటుంబానికి మంచి పేరు, ప్రతిష్టలున్నాయి. కొండా సురేఖ నా కుటుంబంపై అమర్యాదకరంగా.. నాగచైతన్య, సమంతపై అనుచిత వ్యాఖ్యలు చేశారు. మా కుటుంబ పరువు, మర్యాదలకు భంగం వాటిల్లింది. మంత్రి చేసిన కామెంట్స్ అసత్య ఆరోపణలు. రాజకీయ దురుద్దేశంతోనే ఇలాంటి కామెంట్స్ చేశారు. ఈ వార్తలు అన్ని చానెళ్లు, పేపర్లలో వచ్చాయి. కొండా సురేఖపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కోర్టుకు నివేదించాడు.పిటిషన్‌పై తదుపరి విచారణను కోర్టు ఈ నెల 10కి వాయిదా వేసింది. ఇవాళ నాగార్జున, సాక్షి సుప్రియ స్టేట్‌మెంట్స్ రికార్డు చేయగా.. 10న మరో సాక్షి వెంకటేశ్వర్లు స్టేట్‌మెంట్ రికార్డు చేయనున్నారు.

## అట్టహాసంగా జాతీయ సినీ అవార్డుల ప్రదానం

- **అవార్డులు అందజేసిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము**




వివరాలు 2వ పేజీలో

# నాపైనా కేసు పెడుతారా..?



● బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**బలగం టీవీ, హైదరాబాద్**

నల్లగొండ జిల్లాలోని ముషంపల్లి గ్రామానికి చెందిన మల్లయ్య అనే రైతు.. కాంగ్రెస్ పార్టీని అనవసరంగా గెలిపించామంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ పాలనలో సాగునీరు వచ్చింది. 24 గంటల నాణ్యమైన కరెంట్ అందింది. ఏడాదికి రెండుసార్లు రైతుబంధు జమ చేసి అప్పుల పాలు కాకుండా చేశారు. కానీ రేవంత్ పాలనలో రైతుబంధు రాక అప్పులపాలవుతున్నామని, మళ్లీ కేసీఆరే రావాలి.. నాతో పాటు మరో పది మందితో కేసీఆర్‌కు ఓట్లు వేయిస్తామని రైతు మల్లయ్య ఆవేదనతో మాట్లాడారు.

రైతు మల్లయ్య మాట్లాడిన వీడియోను జర్నలిస్టు గౌతమ్ గౌడ్ యూట్యూబ్‌లో పోస్టు చేశారు. కాంగ్రెస్ పాలనతో అన్నదాతల పరిస్థితి ఇది అని వివరించే ప్రయత్నం చేశారు. అయితే ఈ వీడియోను పోస్టు చేసిన జర్నలిస్టు గౌతమ్ గౌడ్ కేసు నమోదు చేశారు పోలీసులు. ఈ ఘటనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎక్స్ వేదికగా స్పందించారు.


అసలు ఈ వీడియోలో తప్పేముంది..? జర్నలిస్టు గౌతమ్ గౌడ్‌పై కేసు ఎందుకు నమోదు చేశారు..? అని తెలంగాణ డీజీపీని కేటీఆర్ ప్రశ్నించారు. నేను కూడా ముషంపల్లిలో రైతు మల్లయ్యను కలిశాను. అతనితో మాట్లాడాను. మరి నాపై కేసు పెడుతారా..? అని డీజీపీని కేటీఆర్ సూటిగా ప్రశ్నించారు.

ప్రభుత్వ, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల పట్ల నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ ధ్వజమెత్తారు. ఒకటో తేదీన జీతాలు ఇస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్న రేవంత్ సర్కార్‌కు కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ సిబ్బంది కనిపించడం లేదా..? అని నిలదీశారు. ఈ మేరకు కేటీఆర్ ఎక్స్ వేదికగా స్పందించారు.దండగమారి పాలనలో పండుగ పూట కూడా పస్తులు ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందని కేటీఆర్ పేర్కొన్నారు. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ సిబ్బందికి ఐదారు నెలలుగా జీతాల్లేవ్ అని తెలిపారు. పంచాయతీ వర్కర్స్, మున్సిపాలిటీ కార్మికులు, ఆసుపత్రి సిబ్బంది, హాస్టల్ వర్కర్స్, గెస్ట్ లెక్చరర్స్.. ఇలా ప్రతీ శాఖలో వేతనాల్లేక చిరుద్యోగులు విలవిలలాడిపోతున్నారని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు.

చిరుద్యోగులు కుటుంబాలను నెట్టుకురావడానికి అప్పులు చేసి నానా తిప్పలు పడుతున్నారని కేటీఆర్ తెలిపారు. ఒకటో తారీఖునే జీతాలు ఇస్తామని పలికిన ప్రగల్భాలు ఎటుబాయె..? దసరా దగ్గరికి వచ్చింది..సరుకులు కొనడానికి చేతిలో నయాపైసా లేదు..! నెలల తరబడి వేతనాలు పెండింగ్‌లో ఉంటే బతుకు బండి నడిచేదెట్లా..? 10 నెలల్లో తెచ్చిన రూ. 80 వేల కోట్ల అప్పులు ఎక్కడికి పోయినయ్..? చిరుద్యోగులు.. చిన్న జీతాల కార్మికుల అవస్థలను పట్టించుకోండి..వెంటనే వేతనాలు చెల్లించండి అని రేవంత్ సర్కార్‌ను కేటీఆర్ డిమాండ్ చేశారు.

## ఇద్దరు శాస్త్రవేత్తలకు భౌతిక శాస్త్రంలో నోబెల్

**బలగం టీవీ, హైదరాబాద్**



భౌతిక శాస్త్రంలో నోబెల్ ప్రైజ్ 2024ను జాన్ హాప్‌ఫీల్డ్, జాఫ్రీ హింటన్‌కు ప్రకటించారు. వారు మెషిన్ లెర్నింగ్ లో పనిచేసినందుకు ఈ బహుమతి గెలుచుకున్నారు. స్వీడన్ లోని స్టాక్ హోమ్ లో ఉన్న రాయల్ స్వీడిష్ అకాడమి ఆఫ్ సైన్సెస్ ఈ విషయాన్ని మంగళవారం ప్రకటించింది.జాన్ హాప్‌ఫీల్డ్ డేటాలో ఇమేజ్‌లు , ఇతర నమూనాలను నిల్వ చేయగల , పునర్నిర్మించగల అనుబంధ మెమరీని సృష్టించారు. జాఫ్రీ హింటన్ డేటాలోని లక్షణాలను స్వయంచాలకంగా కనుగొనగల ఒక పద్ధతిని కనుగొన్నారు, ఇది చిత్రాలలోని నిర్దిష్ట అంశాలను గుర్తించడానికి ఉపయోగపడుతుంది. ఫిజిక్స్ నోబెల్ బహుమతి 11 మిలియన్ల స్వీడిష్ క్రోనార్ (సుమారు రూ.8.3 కోట్లు) నగదు పురస్కారంతో దక్కుతుంది.

# న్యూజిలాండ్ పై ఆస్ట్రేలియా ఘన విజయం




**బలగం టీవీ, దుబాయ్**

మహిళల టీ20 ప్రపంచకప్‌లో భాగంగా మంగళవారం జరిగిన మ్యాచ్‌లో ఆస్ట్రేలియా మహిళల జట్టు అద్భుత విజయం సాధించింది. గ్రూప్-ఏలో పోటీ పడుతున్న ఆస్ట్రేలియా 60 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ ఎంచుకున్న ఆస్ట్రేలియా నిర్ణీత ఓవర్లలో 148/8 పరుగులు చేసింది. టాపార్డ్ లో కెప్టెన్ అలిస్సా హీలీ (26), బెత్ మూనీ (40), ఎల్లీస్ పెర్రీ (30) దంచికొట్టడంతో ఆసీస్ స్కోరు భారీగా నమోదైంది.

ఇక 149 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన న్యూజిలాండ్ కేవలం 88 పరుగులకే ఆలౌటైంది. అమేలియా కెర్ 29 పరుగులతో టాప్ స్కోరర్ గా నిలిచింది. ఆసీస్ బౌలర్లలో మెగాన్ షట్, అనాబెల్ సదర్లాండ్ మూడు వికెట్లు తీయగా సోఫీ మోలినెక్స్ రెండు వికెట్లు, జార్జియా వేర్‌హామ్, తహ్లియా మెక్‌గ్రాత్ ఒక్కో వికెట్ తీశారు. దీంతో ఆస్ట్రేలియా జట్టుకు భారీ విజయం దక్కింది.

ఎంబీబీఎస్ సీట్లు

# సాధించిన విద్యార్థులకు శుభాకాంక్షలు



● బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు

**బలగం టీవీ, హైదరాబాద్**

వైద్య విద్యకు తెలంగాణను కేరాఫ్ అడ్రస్‌గా చేసిన ఘనత కేసీఆర్‌కు, బీఆర్ఎస్ పార్టీకే దక్కుతుందని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. నీట్‌లో 3 లక్షలకు పైగా ర్యాంకులు వచ్చిన విద్యార్థులకు కూడా కన్వీనర్ కోటాలో ఎంబీబీఎస్ సీట్లు రావడం సంతోషం చదగ్గ విషయమని చెప్పారు. బీసీ ఏ కేటగిరిలో 3.35 లక్షల ర్యాంకు వచ్చిన విద్యార్థికి, ఎస్సీ కేటగిరీలో 3.11 లక్షల ర్యాంకు, ఎస్టీ కేటగిరీలో 2.89 లక్షల ర్యాంకు, బీసీ బీలో 2.27 లక్షలు, బీసీ సీలో 3.14 లక్షలు, బీసీ డీలో 2.13 లక్షలు, బీసీ ఈలో 2.24 లక్షల ర్యాంకులు సాధించిన వారికి ఎంబీబీఎస్ సీట్లు రావడం చరిత్రలో ఇదే మొదటిసారని తెలిపారు. కన్వీనర్ కోటాలో ఎంబీబీఎస్ సీట్లు సాధించిన విద్యార్థులకు ఎక్స్ వేదికగా శుభాకాంక్షలు తెలిపారు.

మారుమూల ప్రాంతాలకు సూపర్ స్పెషాలిటీ వైద్యాన్ని చేరువ చేయడం, తెలంగాణ బిడ్డలు డాక్టర్ కావాలనే కలను స్వరాష్ట్రంలోనే ఉండి సుసాధ్యం చేసుకోవాలని జిల్లాకు ఒక మెడికల్ కాలేజిని కేసీఆర్ ఏర్పాటు చేశారన్నారు. గత పదేండ్ల కాలంలో రాష్ట్రంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీల సంఖ్య 5 నుంచి 34కు పెరిగాయని తెలిపారు. అదేవిధంగా ప్రభుత్వ, ప్రైవేటు కలిపి మొత్తం మెడికల్ కాలేజీల సంఖ్య 20 నుంచి 60కి చేరాయన్ని వెల్లడించారు. దీంతో రాష్ట్రంలో ఎంబీబీఎస్ సీట్ల సంఖ్య 2850 నుంచి 8315లకు పెరిగిందని, ఎంబీబీఎస్ చదవాలనుకునే విద్యార్థులకు అవకాశాలు గణనీయంగా పెరిగాయన్నారు.

"కన్వీనర్ కోటాలో ఎంబీబీఎస్ సీట్లు సాధించిన విద్యార్థులకు శుభాకాంక్షలు. మూడు లక్షల పైగా ర్యాంకులు వచ్చిన తెలంగాణ విద్యార్థులకు కూడా కన్వీనర్ కోటాలో ఎంబీబీఎస్ సీట్లు రావడం సంతోషం చదగ్గ విషయం. బీసీ-ఏ కేటగిరిలో 3.35 లక్షల ర్యాంకు వచ్చిన విద్యార్థికి, ఎస్సీ కేటగిరీలో 3.11 లక్షల ర్యాంకు వచ్చిన విద్యార్థికి, ఎస్టీ కేటగిరీలో 2.89 లక్షల ర్యాంకు, బీసీ-బి లో 2.27 లక్షలు, బీసీ-సీ లో 3.14 లక్షలు, బీసీ-డి లో 2.13 లక్షలు, బీసీ-ఈ లో 2.24 లక్షల గరిష్ట ర్యాంకులు సాధించిన వారికి ఎంబీబీఎస్ సీట్లు రావడం చరిత్రలో ఇదే మొదటిసారి.

మారుమూల ప్రాంతాలకు సూపర్ స్పెషాలిటీ వైద్యాన్ని చేరువ చేయడం, తెలంగాణ బిడ్డలు డాక్టర్ కావాలనే కలను స్వరాష్ట్రంలోనే వుండి సుసాధ్యం చేసుకోవాలని కేసీఆర్ గారు జిల్లాకు ఒక మెడికల్ కాలేజి ఏర్పాటు చేశారు. కేసీఆర్ పాలనలో గడిచిన పదేళ్ల కాలంలో రాష్ట్రంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీల సంఖ్య 5 నుంచి 34కు పెరిగాయి. ప్రభుత్వ, ప్రైవేటు కలిపి మొత్తం మెడికల్ కాలేజీల సంఖ్య 20 నుంచి 60కి చేరాయి.

వైద్య విద్యకు తెలంగాణను కేరాఫ్ అడ్రస్ గా చేసిన ఘనత కేసీఆర్‌కు, బీఆర్ఎస్ పార్టీకి దక్కుతుంది. దీంతో తెలంగాణలో ఎంబీబీఎస్ సీట్ల సంఖ్య 2850 నుంచి 8315లకు పెరిగి, ఎంబీబీఎస్ చదవాలనుకునే విద్యార్థులకు అవకాశాలు గణనీయంగా పెరిగాయి. వైద్య విద్య కోసం చైనా, ఉక్రెయిన్, రష్యా, ఫిలిప్పిన్స్ వంటి దేశాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా పోయింది. రాష్ట్రంలో పెరిగిన మెడికల్ సీట్లను విద్యార్థులు అందిపుచ్చుకోవాలని, తెలంగాణాలో ఉంటూ వైద్య విద్య చదివి దేశానికి సేవ చేయాలని ఆకాంక్షిస్తున్నాను." అంటూ హరీశ్ రావు ట్వీట్ చేశారు.

## హైడ్రాతో సర్వే ఆఫ్ ఇండియా

(మొదటిపేజీ తరువాయి)

క్రోడీకరించి చెరువులు, నాలాల పరిస్థితి, కనుమరుగైన చెరువులపై డాటాను పరిశీలించారు.

సర్వే ఆఫ్ ఇండియా అందించిన వివరాలతో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల్లోని చెరువులపై సమగ్ర నివేదిక తయారు చేస్తామని, ఆ డేటాను డిజిటలైజేషన్‌తో పాటు చెరువుల వాస్తవ విస్తీర్ణం, నాలాల పొడవు, వెడల్పులను నిర్ధారించి పూర్తి వివరాలతో నివేదికను సిద్ధంగా చేయనున్నట్లు రంగనాథ్ వెల్లడించారు. చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లను శాస్త్రీయ పద్ధతిలో నిర్ధారించి తదుపరి చర్యలను చేపట్టేందుకు కసరత్తు చేస్తున్నట్లు రంగనాథ్ తెలిపారు. ప్రాధాన్యాత క్రమంలో చెరువులను ఒకదాని తర్వాత ఒకటిగా పునరుద్ధరించేందుకు హైడ్రా చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు.



## జమ్మూకశ్మీర్‌లో సీపీఐ(ఎం) అభ్యర్థి ఘన విజయం


**బలగం టీవీ, హైదరాబాద్**

జమ్మూకశ్మీర్ లో భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్) అభ్యర్థి ఘనవిజయం సాధించారు. కుల్గాం నియోజకవర్గం నుంచి పోటీ చేసిన ముహ్మద్ యూసుఫ్ తరిగామి విజయం సాధించారు. ఇది ఆయన ఐదోసారి విజయం.

## వినేశ్ ఫొగాట్ విజయం


**బలగం టీవీ, హైదరాబాద్**

హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో భారత మాజీ మహిళా రెజ్లర్, కాంగ్రెస్ అభ్యర్థి వినేశ్ ఫొగాట్ విజయం సాధించారు. జులానా నియోజకవర్గం నుంచి పోటీ చేసిన ఆమె ప్రత్యర్థిపై దాదాపు 6వేల ఓట్ల తేడాతో గెలుపొందారు. ఆమె రెజ్లింగ్‌కు రిటైర్మెంట్ ప్రకటించి ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన విషయం తెలిసిందే.



# రాజాసాబ్ మేకింగ్ విడుదల





**బలగం టీవి, హైదరాబాద్**

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటిస్తున్న చిత్రం 'ది రాజా సాబ్' ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటోంది. హార్రర్ కామెడీ జోనర్‌లో వస్తోన్న ఈ చిత్రానికి మారుతి దర్శకత్వం వహిస్తున్నాడు. ఇవాళ మారుతి బర్త్ డే సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేస్తూ మేకర్స్ స్పెషల్ గ్లింప్స్ వీడియో విడుదల చేశారు. కింగ్ సైజ్ ఎంటర్‌టైన్‌మెంట్ అంటూ విడుదల చేసిన మేకింగ్ విజువల్స్ వైరలవుతున్నాయి.

ఈ వీడియోలో దర్శకుడు మారుతి ఈ చిత్రం కోసం ఎంతలా కష్టపడుతున్నారో మనకు చూపెట్టారు. ఇక ఈ వీడియోతో అభిమానులు సర్‌ప్రైజ్ అయ్యారు. ఈ సినిమాలో అందాల భామలు మాళవిక మోహనన్, నిధి అగర్వాల్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఈ చిత్రాన్ని పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై టీజీ విశ్వప్రసాద్ ప్రొడ్యూస్ చేస్తున్నారు. ఈ చిత్రాన్ని 2025 ఏప్రిల్ 10న విడుదల చేస్తున్నట్టు ప్రకటించారు.

# పుష్ప ది రూల్ ఫస్ట్ హాఫ్ లాక్డ్

**బలగం టీవి, హైదరాబాద్**

సుకుమార్, అల్లు అర్జున్ కాంబోలో వచ్చిన బ్లాక్ బస్టర్ చిత్రం పుష్ప ది రైజ్ చిత్రానికి సీక్వెల్‌గా వస్తున్న మోస్ట్ అవైటెడ్ చిత్రం 'పుష్ప ది రూల్' పై భారీ అంచనాలు ఉన్న సంగతి తెలిసిందే. ఈ సినిమా డిసెంబర్ 6న ప్రేక్షకుల ముందుకు రానుండగా.. తాజాగా ఈ మూవీకి సంబంధించి అప్‌డేట్‌ను పంచుకున్నారు మేకర్స్. ఈ సినిమాకు సంబంధించి ఫస్ట్ ఆఫ్ ఎడిటింగ్ పని అయిపోయి లాక్ అయినట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా ఈ విషయాన్ని తెలుపుతూ.. లాక్డ్ %డ% లోడెడ్ అంటూ కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. ప్రస్తుతం క్లైమాక్స్ షూటింగ్ జరుపుకుంటుంది ఈ చిత్రం. ఇక క్లైమాక్స్ అనంతరం శరవేగంగా రెండో భాగం పోస్ట్ ప్రోడక్షన్ పనులు స్టార్ట్ చేయబోతున్నట్లు తెలిపింది. సుకుమార్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో రష్మిక కథానాయికగా నటిస్తుండగా ఫహద్ ఫాజిల్, సునీల్, అనసూయ, జగదీశ్ ప్రతాప్, ధనుంజయ కీలక పాత్రలు పోషిస్తున్నారు. రూ.500 కోట్ల భారీ బడ్జెట్‌తో మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సంస్థలు సంయుక్తంగా ఈ సినిమాను నిర్మిస్తున్నాయి.




# ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్ నుంచి మరో ప్రాజెక్ట్

**బలగం టీవి, హైదరాబాద్**

ప్రశాంత్‌వర్మ ప్రస్తుతం వరుస సినిమాలతో ఫుల్ బిజీగా మారాడు. ఆయన దర్శకత్వంలో రాబోతున్న తాజా చిత్రం 'జై హనుమాన్'. గతేడాది 'హనుమాన్'తో బ్లాక్ బస్టర్ అందుకున్న ఈ దర్శకుడు ప్రస్తుతం దీనికి సీక్వెల్ 'జై హనుమాన్' తెరకెక్కించే పనిలో ఉన్నాడు. ఇప్పటికే ఈ సినిమాకు సంబంధించి ఫస్ట్ లుక్ విడుదల చేయగా.. గూస్ బంప్స్ తెప్పించేలా ఉంది. అయితే ఈ సినిమాతో పాటు నందమూరి బాలకృష్ణ తనయుడు మోక్షజ్ఞతో కూడా ఒక సినిమా చేయబోతున్నాడు ప్రశాంత్ వర్మ. అయితే ఈ రెండు సినిమాలు కాకుండా తన సినిమాటిక్ యూనివర్స్ నుంచి తాజాగా మరో సినిమా అప్‌డేట్ ఇచ్చాడు. అక్టోబర్ 10న ఇందుకు సంబంధించిన అనౌన్స్ ఇవ్వనున్నట్లు ఎక్స్ వేదికగా ప్రకటించాడు. ఇక ఈ సినిమా పేరు ఏమిటి, ఇందులో నటించే నటీనటులు ఎవరు అన్న విషయాలు గురువారం తెలియనుంది. "ఈ నవరాత్రికి శక్తి మాయాజాలాన్ని చూసేందుకు అలాగే వీక్షించడానికి సిద్ధంగా ఉండండి"! అంటూ ప్రశాంత్‌వర్మ రాసుకోచ్చాడు.



# 'ఓదెల 2' షూటింగ్‌లో తమన్నా

**బలగం టీవి, హైదరాబాద్**

టాలీవుడ్‌లో తెరకెక్కుతున్న క్రేజీ సీక్వెల్ చిత్రాల్లో 'ఓదెల 2' ఒకటి. ఇఈ చిత్రాన్ని దర్శకుడు అశోక్ తేజ డైరెక్ట్ చేస్తుండగా సంపత్ నంది ఈ చిత్రానికి కథను అందిస్తున్నారు. ఇక ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్స్, బిహైండ్ ది సీన్స్ ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. అయితే, ఇప్పుడు ఈ సినిమా ఫైనల్ షెడ్యూల్ షూటింగ్ ప్రారంభించినట్లుగా చిత్ర యూనిట్ తెలిపింది. ఓదెల గ్రామంలో ఈ చిత్ర ఫైనల్ షెడ్యూల్ షూటింగ్ జరుపుకుంటోంది. మహాదేవుని ఆశీస్సులతో కాశీలో ప్రారంభమైన ఈ థ్రిల్లింగ్ సీక్వెల్ ఇప్పుడు ఓదెల మల్లన్న క్షేత్రంలో చిత్రీకరణ జరుగుతోంది. ఇక ఈ షెడ్యూల్‌లో స్టార్ బ్యూటీ తమన్నా జాయిన్ అయ్యింది. ఆమె ఈ సినిమాలో శివశక్తి(నాగ సాధు) పాత్రలో నటిస్తోంది. టీం ఐకానిక్ ఓదెల మల్లన్న ఆలయం, గ్రామంలోని అందమైన ప్రదేశాలలో కీలక సన్నివేశాలను షూట్ చేస్తోంది. ఇక ఈ సినిమాలో హెబ్బా పటేల్, వశిష్ట సింహా తదితరులు ఇతర ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. అజనీష్ లోక్‌నాథ్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తుండగా మధు క్రియేషన్స్, సంపత్ నంది టీమ్‌వర్క్స్ బ్యానర్లు సంయుక్తంగా ప్రొడ్యూస్ చేస్తున్నాయి.



# ఓటీటీలోకి సుహాస్ 'గొర్రె పురాణం'..




**బలగం టీవి, హైదరాబాద్**

సుహాస్ హీరోగా నటించిన చిత్రం' గొర్రె పురాణం'. ఈ మూవీ బాక్సాఫీస్ దగ్గర అనుకున్న స్థాయిలో విజయాన్ని అందుకోలేకపోయింది. కానీ మంచి టాక్‌ను తెచ్చుకుంది. తాజాగా ఈ సినిమా ఓటీటీలోకి రాబోతోంది.

గొర్రె పురాణం మూవీని ఫోకల్ వెంచర్స్ బ్యానర్ పై ప్రవీణ్‌రెడ్డి నిర్మించారు. పవన్ సి. హెచ్ సంగీతం అందించారు.

గొర్రె పురాణం అనే టైటిల్ కు తగ్గట్టే ఈ సినిమా అంతా.. ఓ గొర్రె చుట్టూ తిరుగుతుంది. ఒక గొర్రె రెండు మతాల మధ్య ఎలా నలిగిపోతుందో చక్కగా చూపించారు మూవీ మేకర్స్. కథ విషయానికి వస్తే.. బక్రీద్ పండుగ నాడు ఓ ముస్లిం వ్యక్తి తన ఇంట్లో గొర్రె బలి ఇ ఎ ా ్వ ల ని తీసుకవస్తాడు. కానీ, ఆ గొర్రె తప్పించుకుని ఓ గుడిలోకి వెళ్లింది. దీంతో ఇరు మతాల వారు గొర్రె తమదంటే.. తమదని, తామంటే.. తాము బలిస్తామని గొడవకు దిగుతారు. ఇలా ఒక గొర్రె కోసం రెండు వర్గాల మధ్య గొడవలకు కారణమవుతోంది. చివరికి ఏమైందో తెలియాలం టే.. గొర్రె పురాణం చూడాల్సిందే.

ఈ మూవీ డిజిటల్ రైట్స్ ను ప్రముఖ తెలుగు ఓటీటీ ప్లాట్ ఫామ్ ఆహా సొంతం చేసుకుంది. ఈ మేరకు ఈ సినిమా అక్టోబర్ 10 నుంచి స్ట్రీమింగ్ కాబోతుందని ఆహా అధికారికంగా ప్రకటించింది. ఓ పోస్టర్ ను కూడా విడుదల చేసింది మూవీ యూనిట్.

# లగ్గం చీరల పండుగ.. 'రీల్ పెట్టు-చీర పట్టు'

## లగ్గం' సినిమా వెరైటీ ప్రమోషన్స్..

**బలగం టీవి, హైదరాబాద్**

టాలీవుడ్‌లో తెరకెక్కిన ఆసక్తికర చిత్రం 'లగ్గం'. ఈ సినిమాను రమేశ్ చెప్పాల డైరెక్ట్ చేస్తున్నాడు. ఈ చిత్రాన్ని సుబిషి ఎంటర్‌టైన్మెంట్స్ బ్యానర్‌పై వేణుగోపాల్ రెడ్డి నిర్మిస్తున్నారు.కాగా ఈ సినిమా వినూత్నమైన ప్రమోషన్స్‌తో దూసుకెళ్తోంది. ఈ క్రమంలో లగ్గం చీరల పండుగ పేరుతో 'రీల్ పెట్టు – చీర పట్టు' అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఆసక్తి కలిగిన యువత ఇన్స్టాగ్రామ్‌లో 'లగ్గం' సినిమాకు సంభందించి పాటలకు గానీ లేదా టీజర్‌లో డైలాగ్స్‌కు గాని తమ స్టైల్‌లో రీల్ లేదా యూట్యూబ్ షాట్ చేసి 8885050729 నెంబర్‌కు పంపితే చీరను గిఫ్ట్‌గా పొందవచ్చు. అలాగే రీల్‌ను తప్పకుండా వారి అకౌంట్‌లో పోస్ట్ చేసి లగ్గం పేజీకి ట్యాగ్ చెయ్యాలి. బహుమతులు అందచేయడానికి లగ్గం యూనిట్ సిద్ధంగా ఉందని మేకర్స్ తెలిపారు.

"ఇది తెలంగాణ నేపథ్యంలో జరిగే తెలుగు సినిమా. చిత్రంలో నటీనటులు పూర్తి తెలంగాణ యాస మాట్లాడకుండా వాడుక భాషలో మాట్లాడుతారు. ఈ చిత్రం తప్పకుండా విజయం సాధిస్తుంది. ఇది లగ్గం నామ సంవత్సరం కాబోతుంది" అని దర్శకుడు ధీమా వ్యక్తం చేశాడు. పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు పూర్తిచేసుకున్న లగ్గం సినిమా అక్టోబర్ 25న వరల్డ్‌వైడ్‌గా ఏషియన్ సురేష్ ద్వారా గ్రాండ్‌గా విడుదల కాబోతోంది.

